ఈనాడు
బాపట్ల
ఆదివారం అక్టోబరు 6, 2024

ఇసుక క్వారీలు సందర్శించిన కలెక్టర్

కొల్లూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం తలపెట్టిన ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేసేందుకు అవసరమైన కసరత్తులో భాగంగా సంబంధిత శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ వెంకట మురళి శనివారం మండల పరిధిలోని కృష్ణానదీతీరంలోని గాజుల్లంక, జువ్వలపాలెం సమీపంలోని ఇసుక క్వారీలు పరిశీలించారు. ఈ సందర్భంగా భూగర్భ వనరుల శాఖాధికారులు కలెక్టరుకు వివరాలు తెలియజేశారు. గతంలో తవ్వకాలు జరిపిన ఆ రెండు క్వారీలతో పాటు పెసర్లంక సమీపంలోని అరవింద వారధికి ఎగువన మరొక క్వారీ (గాజుల్లంక -2) అక్కడ ఉన్న ఇసుక మేటల దృష్ట్యా నిర్వహించేందుకు అవకాశాలు ఉన్నట్లు కొద్ది రోజుల క్రితం జరిపిన పరిశీలనలో గుర్తించామన్నారు. జిల్లాలో ఏడాదికి మూడు లక్షల టన్నులకు పైగా ఇసుక అవసరం ఉంటుందని ప్రాథమికంగా అంచనాకు వచ్చామని అధికారులు కలెక్టరుకు వివరించారు. ఈ అవశ్యకతను దృష్టిలో ఉంచుకుని కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలో రెండు కొత్త క్వారీలను కలిపి మొత్తం ఐదు క్వారీలు నిర్వహించాల్సి ఉంటుందని, ఇందుకోసం ఒక్కో క్వారీకి 4.9 ఎకరాల ఇసుక మేటలు కేటాయించాల్సి ఉంటుందని తెలిపారు. నిబంధనల ప్రకారం రెండు క్వారీలకు మధ్య కనీసం 500 మీటర్ల దూరం ఉండాలని కలెక్టర్‌కు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న నదీ ప్రవాహాన్ని బట్టి రెండు మండలాల పరిధిలోని కృష్ణానదిలో ఇసుక వెలికి తీసే అవకాశం లేదన్నారు. సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, భూగర్భ వనరులశాఖ ఆర్‌వి రాజు, నదీ పరిరక్షణశాఖ ఏఈ రమేష్ నాయక్ పాల్గొన్నారు.


జువ్వలపాలెంలో ఇసుక క్వారీ పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట మురళి


కొత్తగొల్లపాలెంలో జ్వరం సోకిన రోగికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ విజయభాస్కరరావు

జ్వర గ్రామాల్లో వైద్య శిబిరాలు

52 మందికి పరీక్షలు.. ఆరుగురికి విష జ్వరాలు

ఇంటింటా సర్వే చేసిన సిబ్బంది

ఈనాడు కథనానికి స్పందన

పెదగంజాం (చినగంజాం), న్యూస్‌టుడే: పెదగంజాం పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డికొత్తగొల్లపాలెం, ఆవులదొడ్డిపాతగొల్లపాలెం గ్రామాల్లో వేర్వేరుగా రెండు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి 52 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు చినగంజాం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి ఎస్.విజయభాస్కరరావు తెలిపారు. ఆ రెండు గ్రామాల్లో జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వారి ఇబ్బందులను వివరిస్తూ 'ఈనాడు'లో 'జ్వరంతో మంచమెక్కిన పల్లెలు' శీర్షికతో శనివారం కథనం ప్రచురితమైంది. దీనికి జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. ఆ గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని బాపట్ల డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి అందిన ఆదేశాల మేరకు జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రేమచంద్, చీరాల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సబ్-యూనిట్ అధికారి డాక్టర్ పి.శ్రీనివాసరావులు సూచించారని డాక్టర్ విజయభాస్కరరావు చెప్పారు. దీంతో ఉదయాన్నే రెండు గ్రామాలకు 14 మంది వైద్య సిబ్బందితో వెళ్లి ఇంటింటికీ సర్వే చేయించినట్లు తెలిపారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. కొత్తగొల్లపాలెంలో యల్లావుల సుబ్బమ్మ, యల్లావుల వెంకాయమ్మ, బూర్ల జ్యోతి, యల్లావుల లావణ్య, వడ్లమూడి నాగచైతన్యలకు విష జ్వరాలు ఉన్నట్లు గుర్తించి, ర్యాపిడ్ పరీక్షలు చేసినట్లు డాక్టరు చెప్పారు. పరీక్షల్లో టైపాయిడ్ లక్షణాలు ఉన్నాయన్నారు. పాతగొల్లపాలెంలో గడ్డం మోక్షిత్‌కు జ్వరం ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. పరీక్షలు అనంతరం మందులు అందజేశామన్నారు. వైద్య శిబిరాలు కొనసాగిస్తామని తెలిపారు. గ్రామంలోని మట్టి రోడ్ల గుంతల్లో చేరిన వర్షపు నిల్వ నీటిపై అబేటు మందు, బ్లీచింగ్‌ను చల్లించామన్నారు. రాత్రికి ఫాగింగ్ చేయించినట్లు వివరించారు. శిబిరాల అనంతరం వివరాలను ఉన్నతాధికారులకు పంపినట్లు విజయభాస్కరరావు వెల్లడించారు.


పాతగొల్లపాలెంలో అబేటు మందును పిచికారీ చేస్తున్న సిబ్బంది

పోటెత్తుతున్న దరఖాస్తులు

మద్యం దుకాణాలపై సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, వైద్యులు ఆసక్తి

సందేహాల నివృత్తికి కంట్రోల్ రూం ఏర్పాటు

ఈనాడు–బాపట్ల

మద్యం దుకాణాలు ప్రైవేటుగా ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో వాటిని దక్కించుకోవడానికి పోటీ నెలకొంది. ఇప్పటి వరకు ఈ రంగంలో లేని కొత్త వ్యక్తులు దరఖాస్తులు చేస్తున్నారు. వారిలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, వైద్యులు, ఆడిటర్లు, గుత్తేదారులు ఉన్నారు. స్వయంగా కార్యాలయాలకు వచ్చి దరఖాస్తు చేయడం విషయమై సందేహాలు నివృత్తి చేసుకుంటున్నారని అధికారులు తెలిపారు. ఒక్కో షాపుకు ప్రస్తుతం దాఖలవుతున్న దరఖాస్తులను పరిశీలిస్తే అంచనాలు మించి వస్తాయని చెబుతున్నారు. ప్రధానంగా గుంటూరు, మంగళగిరి-తాడేపల్లి, పొన్నూరు తదితర పట్టణాల్లో సగటున ఒక్కో షాపుకు 10కి పైగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని ఎక్సైజ్ వర్గాలు అంటున్నాయి. గతంలో ఎవరైతే మద్యం దుకాణాలు, రెస్టారెంట్లు నడిపారో వారే దరఖాస్తులు చేసుకుంటారని భావించిన అధికారులకు తాజా పరిణామంతో ఆశ్చర్యపోతున్నారు.

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఎక్సైజ్ యంత్రాంగం సాధ్యమైనంత ఎక్కువ మందితో దరఖాస్తులు చేయించేలా అవగాహన కల్పిస్తున్నారు. దరఖాస్తు రుసుముల ద్వారా ప్రభుత్వానికి పెద్దమొత్తంలో ఆదాయం తెచ్చిపెట్టాలని అధికారులు యోచిస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం నిర్దేశించిన బ్రాండ్ల మద్యాన్నే విక్రయించింది. దీంతో పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం భారీగా వచ్చిపడేది. కానీ నూతన పాలసీలో అన్ని రకాల బ్రాండ్లు, తక్కువ ధరలకే లభ్యమయ్యేలా అందుబాటులోకి తీసుకొస్తామని ప్రకటించింది. ఎవరైనా వచ్చి లాటరీలో షాపు దక్కించుకునేలా పారదర్శక విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈసారి దరఖాస్తు రుసుము రూ.2 లక్షలు పెట్టి దాన్ని నాన్ రిఫండబుల్ అమౌంట్‌గా పేర్కొంది. దీంతో ఎవరైతే సీరియస్‌గా వ్యాపారం చేయాలనుకుంటున్నారో వారు మాత్రమే పోటీపడటం వల్ల వ్యాపార నిర్వహణ సామర్థ్యం ఉన్న వ్యక్తులు వస్తారని చెబుతున్నారు. గతంలో దరఖాస్తు రూ.10 వేలు ఉండేది. దీంతో ఎవరు పడితే వారు దరఖాస్తు చేసుకునేవారు. తీరా షాపు దక్కించుకున్నాక నిర్దేశిత లైసెన్సు ఫీజులో కట్టలేక ఫీజులు కట్టకుండా మోహం చాటేసేవారు. తిరిగి వాటికి దరఖాస్తులు స్వీకరించాల్సి వచ్చేది. ప్రస్తుత పాలసీలో మాత్రం పట్టణ, రూరల్ ప్రాంతాల్లో వసూలు చేసే లైసెన్సు ఫీజు కూడా వేర్వేరుగా నిర్ణయించడంతో పాటు ఏ మండలంలో ఎన్ని షాపులు పర్మిషన్లు ఇచ్చేది కూడా ముందుగానే వెల్లడించారు. దీంతో వ్యాపారులకు ఒక అవగాహన ఏర్పడింది. ప్రభుత్వం నిర్ణయించిన లైసెన్సు ఫీజు చెల్లించటానికి గతంలో మూడు వాయిదాలు ఉండేవి. ప్రస్తుతం దాన్ని ఆరు వాయిదాలకు పెంచారు. పాలసీలో ఇది వ్యాపారులకు అనుకూలమైన నిర్ణయమే.

బాపట్ల జిల్లాలో సర్కిళ్ల వారీగా షాపుల సంఖ్య

సర్కిల్	షాపుల సంఖ్య
బాపట్ల	19
రేపల్లె	12
వేమూరు	12
నగరం	12
చీరాల	24
పర్చూరు	15
అద్దంకి	23
మొత్తం	117


బాపట్ల ప్రధాన కూడలిలో మద్యం షాపులకు దరఖాస్తు ప్రకటనపై ఏర్పాటు చేసిన బ్యానర్

9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తాం



కొత్త వ్యక్తులు మద్యం దుకాణాల నిర్వహణపై ఆసక్తి కనబరుస్తున్నారు. కార్యాలయాలకు వచ్చిన వారందరికీ తక్షణ సమాచారమిచ్చేలా జిల్లా కార్యాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేశాం. ఉద్యోగులను అందుబాటులో ఉంచి దరఖాస్తుదారులు అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానమిస్తున్నాం. జిల్లాలోని అన్ని స్టేషన్లకు వెళ్లి సాధ్యమైనంత వరకు ఎక్కువ మంది దరఖాస్తులు చేసుకునేలా చూడాలని సిబ్బందిని అప్రమత్తం చేశాం. ప్రతి ఒక్కరికి నూతన విధానం తెలియాలని ప్రధాన కూడళ్లలో బ్యానర్లు ప్రదర్శించాం. ఈనెల ఒకటో తేదీన ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ 9న ముగుస్తుంది. 11న లాటరీ తీసి ఎంపిక చేస్తాం.

- గంటా దేవదత్తు, ఎక్సైజ్ సూపరింటెండెంట్, బాపట్ల జిల్లా

ఖజానా శాఖలో పారదర్శకంగా సేవలందించాలి

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: పింఛనుదార్లు, ప్రభుత్వ ఉద్యోగులకు ట్రెజరీ సిబ్బంది పారదర్శకంగా సేవలందించాలని రాష్ట్ర ట్రెజరీ అకౌంట్స్ డైరెక్టరు ఎన్.మోహనరావు పేర్కొన్నారు. ఇప్పుడు మనం ఉద్యోగులమైనా... భవిష్యత్తులో పెన్షనర్లమే అనే విషయాన్ని గుర్తెరిగి బాధ్యతగా ప్రతి ఒక్కరు పనిచేయాలన్నారు. శనివారం ఎస్టీవో కార్యాలయాన్ని సందర్శించి మాట్లాడుతూ ఇటీవల ఈ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులపై వచ్చిన ఫిర్యాదులపై ప్రాథమికంగా విచారణ చేసి, వారందర్నీ ఇతర ప్రాంతాలకు బదిలీ చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగుల పనితీరు ఎలా ఉందనే దానిపైనా పరిశీలన చేసినట్లు వివరించారు. ఈ కార్యాలయంపై వచ్చిన ఫిర్యాదుల మీద విచారించేందుకు రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, రాబోయే రెండు రోజుల్లో వారు ఇక్కడకు వచ్చి విచారణ చేస్తారని వెల్లడించారు. అంతకుముందు కార్యాలయంలో పలు రికార్డులను ఆయన తనిఖీ చేశారు. ఎస్టీవో సుబ్బారావు, ఉద్యోగులు ఉన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నిషేధం : కలెక్టర్

బాపట్ల, న్యూస్‌టుడే: గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించటం నిషేధమని కలెక్టర్ జె.వెంకట రమణ తెలిపారు. కలెక్టరేట్లో శనివారం నిర్వహించిన గర్భస్థ పిండ లింగ నిర్ధారణ వెల్లడి, లింగ ఎంపిక నిషేధంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ వెల్లడిని అరికట్టేలా అధికారులు డికాయ్ ఆపరేషన్ నిర్వహించాలని ఆదేశించారు. స్కానింగ్ ఫలితాలు వెల్లడించే వారిని కఠినంగా శిక్షించాలన్నారు. జిల్లాలో 24 గంటలు పని చేస్తే టోల్‌ఫ్రీ ఏర్పాటు చేసి సమాచారం వచ్చిన వెంటనే చర్యలకు ఉపక్రమించేలా వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. అబార్షన్ కోసం వైద్యులు విధిగా అనుమతులు పొందాల్సిందేనన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయటం చట్టరీత్యా నేరమని ప్రజలకు వివరించి చెప్పాలన్నారు. గర్భిణులపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. అబార్షన్ చేయించుకోవటానికి బాపట్ల నుంచి ఇతర జిల్లాలకు వెళ్లే వారిపై నిఘా ఉంచాలన్నారు. చట్టంపై అవగాహన కల్పిస్తూ రైల్వేస్టేషన్, బస్టాండ్, ఇతర పబ్లిక్ ప్రదేశాల్లో ప్రచార చిత్రాలు, గోడపత్రాలు ఉంచాలన్నారు. సినిమా హాళ్లు, టీవీ ఛానల్స్‌లో ప్రచారం చేయాలన్నారు. జిల్లా సీనియర్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎం.వాణి మాట్లాడుతూ లింగ నిర్ధారణ వెల్లడించే వారిని కఠినంగా శిక్షించాలన్నారు. అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు, డీఎంహెచ్‌వో విజయమ్మ పాల్గొన్నారు.

బీఫార్మసీ విద్యార్థినిపై అత్యాచారం

పోలీసునంటూ బెదిరించిన దుండగుడు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పోలీసునంటూ బెదిరించి దుండగుడు విద్యార్థినిపై అత్యాచారం చేశాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన ఓ విద్యార్థిని గుంటూరు నగరంలోని ప్రైవేట్ వసతిగృహంలో ఉంటూ సమీపంలోని ఓ కళాశాలలో బీ-ఫార్మసీ తృతీయ సంవత్సరం చదువుతోంది. ఆమెకు ఇన్‌స్టాగ్రాంలో పాతగుంటూరుకు చెందిన బార్బర్‌షాపులో పనిచేసే ఓ యువకుడితో పరిచయం ఏర్పడింది. క్రమేణా వారి మధ్య సాన్నిహిత్యం పెరగడంతో కొద్ది రోజుల నుంచి నెహ్రూనగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నారు. ఈక్రమంలో ఈ నెల 4వ తేదీ (శుక్రవారం) వేకువజాము 3 గంటల ప్రాంతంలో వారిద్దరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద టీ తాగి తిరిగి ద్విచక్రవాహనంపై వస్తున్నారు. కొత్తపేట బోసు బొమ్మ కూడలి వద్ద ఓ వ్యక్తి వారిని ఆపి తాను పోలీసునని చెప్పాడు. ఈ సమయంలో ఇద్దరు ఎక్కడ నుంచి వస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకొని అర్ధరాత్రుళ్లు తిరగకూడదన్నాడు. వాళ్లు చెబుతున్న విషయాలు నిజమా? కాదా? అని విచారించి నిర్ధారించుకుంటానని చెప్పాడు. వాళ్లు ఉంటున్న ఇల్లు చూపించమని, ఆ యువతిని అక్కడ తానే దించుతానని చెప్పి ఆగంతకుడు తన ద్విచక్రవాహనంపై ఎక్కించుకున్నాడు. వాళ్ల వెనక వస్తున్న యువకుడి ద్విచక్ర వాహనం పెట్రోలు అయిపోవడంతో ఆగిపోయింది. అదే సమయంలో యువతిని బుచ్చయ్యతోటవైపు తీసుకెళ్లి నిర్మానుష్య ప్రాంతంలో అత్యాచారానికి పాల్పడి బెదిరించి వెళ్లిపోయాడు. కొత్తపేట సీఐ వీరయ్య 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ యువతిపై అత్యాచారానికి పాల్పడినట్లు శనివారం ఫిర్యాదు అందిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

అసంబద్ధ లక్ష్యాలతో ఉద్యోగులపై ఒత్తిడి

అద్దంకి, న్యూస్‌టుడే: తపాలా శాఖలో పనిచేసే సిబ్బందికి విధించిన అసంబద్ధమైన లక్ష్యాలను వెంటనే ఉపసంహరించుకునేలా కేంద్ర ప్రభుత్వం ఆదేశాలివ్వాలని గ్రామీణ డాక్‌సేవకుల సంఘం సంయుక్త కార్యదర్శి పి.రమేష్ అన్నారు. శనివారం అద్దంకి తపాలా కార్యాలయం వద్ద ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంబద్ధ లక్ష్యాలు నిర్దేశిస్తూ ఉద్యోగులపై ఒత్తిడి పెంచుతున్నారన్నారు. దీన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లక్ష్యాల నిర్దేశం కారణంగా కొందరు ఉద్యోగులు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వంపై పోరాటం చేసేందుకు ఉద్యోగులంతా సంఘటితం కావాలన్నారు. ఇందులో భాగంగా ఈనెల 7న సహాయ నిరాకరణ, 9న డివిజనల్ స్థాయిలో ఒక్కరోజు ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగ సంఘాల నేతలు సాయికుమార్, మహేష్‌బాబు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


అద్దంకి తపాలా కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

'2029 కల్లా న్యూయార్క్‌కు విమానం నడుపుతాం'

గన్నవరం, న్యూస్‌టుడే: 2029 నాటికి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అమెరికాలోని న్యూయార్క్ నగరానికి విమాన సర్వీసు నడిపేలా లక్ష్యంగా పెట్టుకున్నట్లు విమానాశ్రయం అభివృద్ధి కమిటీ ఛైర్మన్, ఎంపీ వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన సలహా కమిటీ సమావేశంలో ఆయన కమిటీ వైస్ ఛైర్మన్, ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), కలెక్టర్ డీకే బాలాజీ, డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి, ఎస్పీ గంగాధరరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని అమరావతికి ప్రముఖుల తాకిడి రోజురోజుకు మరింత పెరుగుతున్నందున వీలైనంత త్వరగా నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఇప్పటికే వివిధ కారణాలతో ఆలస్యమైన టెర్మినల్ నిర్మాణ పనులను ముందస్తుగా నిర్ణయించిన 2025 జూన్ నాటికి ఎట్టి పరిస్థితుల్లో పూర్తిచేయాలన్నారు. ముంబయి సర్వీసును అహ్మదాబాద్ వరకు, విశాఖ సర్వీస్ కోల్‌కతా వరకు పెంచడంతో పాటు పర్యాటకంగా అభివృద్ధి కోసం సింగపూర్, థాయ్‌లాండ్, శ్రీలంకలకు సర్వీసులు నడపాలని కేంద్రం, విమానయాన సంస్థలను కోరినట్లు వెల్లడించారు. ఇక్కడి నుంచి దుబయ్‌కు ఎమిరేట్స్ సర్వీస్ వస్తే యూకే, అమెరికా, ఇతర దేశాలకు ప్రయాణికుల రాకపోకలకు మరింత సౌకర్యంగా ఉంటుందని కేంద్రానికి వివరించినట్లు చెప్పారు.

'11 సీట్లకు పరిమితం చేసినా మారని జగన్'


రుధిర క్షేత్రం వద్ద అమర వీరులకు నివాళి అర్పిస్తున్న పిల్లి మాణిక్యరావు

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వాన్ని అపకీర్తి పాలు చేయాలని జగన్ చూస్తున్నారని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి, లెదర్ ఇండస్ట్రీ కార్పొరేషన్ ఛైర్మన్ పిల్లి మాణ్యికరావు విమర్శించారు. శనివారం చీరాల మండలం విజయనగర్ కాలనీలోని కారంచేడు మృత వీరుల రుధిర క్షేత్రం సందర్శించారు. మృతవీరుల సమాధులకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్పొరేషన్ ఛైర్మన్‌గా పదవీ ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయన స్వగ్రామం సందర్శించి, స్థానికులతో ఆనందం పంచుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడూతూ.. తిరుపతి లడ్డూ తయారీలో వాడే నెయ్యి కల్తీ జరగడంతో ప్రపంచవ్యాప్తంగా శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. దీనికి కారణం జగన్‌కు హిందూ మతంపై నమ్మకం లేకపోవడమే అన్నారు. ఎవరికి రాని ఆలోచనలతో జగన్ అయిదేళ్లు రాష్ట్రాన్ని పాలించి, పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసినా బుద్ధి రాలేదన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానికులు, మిత్రులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మారని ఉపాధి పాఠాలు


ఉద్యోగార్థులకు పాత కోర్సులు.. మూస శిక్షణ

సంస్థల అవసరాలు గుర్తించని వైనం

పంథా మారిస్తేనే ఉపాధికి బాటలు

ఈనాడు – అమరావతి

ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉపాధి అవకాశాలెన్నో.. మానవ వనరుల లభ్యతా పుష్కలమే.. అయినా ఆయా సంస్థల అవసరాలు తీరడం లేదు. మూస పద్ధతుల్లో ఇస్తున్న శిక్షణే ఇందుకు ప్రధాన కారణం. వ్యవసాయ, ఉద్యాన, వాణిజ్య పంటల ఆధారంగా అనేక చిన్న, మధ్యతరహా పరిశ్రమలతోపాటు రసాయనాలు, మెటల్, స్పిన్నింగ్, గ్రానైట్, సిమెంట్ పరిశ్రమలతోపాటు బ్రాండెడ్ దుకాణాలు, ఆతిథ్యం, పర్యాటకం, రవాణా, సేవారంగాల్లో ఎన్నో అవకాశాలున్నాయి. వీటికి తగ్గట్టుగా నైపుణ్యం ఉన్న యువత దొరకడం లేదు. వివిధ పరిశ్రమలు ఇతర రాష్ట్రాలు/ప్రాంతాలవారితో ఖాళీలను భర్తీ చేస్తున్నాయి. మరోవైపు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్నత విద్య పూర్తి చేసినవారు అర్హతకు తగ్గ అవకాశాలు దక్కక ఖాళీగా ఉంటున్నారు. స్కిల్‌హబ్‌లు, నైపుణ్య కళాశాలలు, నైపుణ్య కేంద్రాలు, ముఖ్యమంత్రి నైపుణ్యం కేంద్రాలు, సీమెన్స్ శిక్షణ కేంద్రాలు, సీడాప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో శిక్షణ కేంద్రాలున్నా.. వీటి మధ్య సమన్వయం లేక ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. పైగా ఈ కేంద్రాలకు అవసరమైనస్థాయిలో యువత రావడం లేదు. వీరిలో ఆశలు, అంచనాలు ఎక్కువగా ఉండడం, ఆ మేరకు శిక్షణ, ఉపాధి కల్పించలేకపోవడమే అసలు సమస్య. సంస్థలు సైతం ఏళ్లు గడుస్తున్నా పాత కోర్సులనే కొనసాగిస్తుండడం, ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా మార్పులు చేయకపోవడం ప్రధాన లోపాలు. ఆయా రంగాలు, పరిశ్రమలతో సమన్వయం చేసుకుంటూ పని చేస్తే సత్ఫలితాలు సాధించొచ్చు.



లోపాలివే..

☛ గత ఆరు నెలలుగా సీడాప్ కింద లక్ష్యం నిర్దేశించకపోవడంతో శిక్షణ నిలిచిపోయింది. ☛ స్కిల్‌హబ్‌లో అంతా మూస పద్ధతే. పదో తరగతి, ఇంటరు చదివినవారికి డేటా ఎంట్రీ ఆపరేటర్, రిటైల్ దుకాణాల్లో పని చేయడానికి శిక్షణ ఇస్తున్నారు. ☛ ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా కంప్యూటర్‌లో ఆటోక్యాడ్, ఉన్నత నైపుణ్యాల శిక్షణనే యువత కోరుకుంటోంది. ☛ శిక్షకుల్లో చాలామందికి అవసరమైన నైపుణ్యాలు లేకపోవడం సమస్యగా మారింది. ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా కోర్సుల డిజైన్ లేదు. ☛ ఐటీఐలలో డీజిల్, ఆటోమొబైల్, ఫిట్టర్, ఎలక్ట్రికల్ వంటి కోర్సుల్లో శిక్షణ నాసిరకంగా ఉంటోంది. సరైన నైపుణ్యం లేకుండానే ధ్రువపత్రాలిచ్చేస్తుండడంతో 30 మంది బయటకొస్తే ముగ్గురు నలుగురికి మించి అవకాశాలు దక్కడం లేదు. ☛ ఉమ్మడి జిల్లాలో ఉన్న రసాయనాలు, సబ్బులు, దూది, కారం, సిమెంట్, గ్రానైట్, స్టీల్ పాత్రల తయారీ, ప్లాస్టిక్ సామగ్రి, విత్తన శుద్ధి, ప్యాకింగ్ తదితర రంగాల్లో ఏటా ఎంతమందికి అవకాశాలుంటాయి? వీరికి ఎలాంటి నైపుణ్యం అవసరమో శిక్షణ కేంద్రాలకు స్పష్టత లేదు. ☛ వేతనం, పనిచేసే ప్రాంతంపై యువత రాజీ పడడం లేదు. ☛ తక్కువ వేతనం, ఇతరత్రా ఇబ్బందులుండవన్న ఉద్దేశంతో పరిశ్రమవర్గాలవారు బయట ప్రాంతాలవారిని తెచ్చుకుంటున్నారు. ☛ అకౌంటింగ్, మేనేజ్‌మెంట్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, రవాణా రంగాల్లో చాలా తక్కువ సంస్థలు మాత్రమే స్థానికులకు అవకాశాలిస్తున్నాయి.

ఉపాధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలు: 13

చూపించిన ఖాళీలు: 4,260

ఎంపికైన అభ్యర్థులు: 629

ప్రస్తుతం జిల్లాలోని వివిధ అంశాల్లో శిక్షణ పొందుతున్న అభ్యర్థుల వివరాలు..

విభాగం	కేంద్రాలు	అభ్యర్థులు
స్కిల్‌హబ్	8	180
స్కిల్ కళాశాల	1	30
పీఎంవిశ్వకర్మ	8	157
స్కిల్ సెంటర్లు	22	473
సీఎం స్కిల్ కేంద్రాలు	10	445
సీమెన్స్ శిక్షణ	3	104
మొత్తం	52	1,389

కోర్సులు ఇలా..

☛ డేటా ఎంట్రీ ఆపరేటర్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, ఐటీ సేల్స్ టెలీకాలర్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఫీల్డ్ టెక్నీషియన్, అసిస్టెంట్ ప్లంబర్, ఫిట్టర్, ఏసీ మెకానిక్, సీసీటీవీ టెక్నీషియన్, అసిస్టెంట్ సర్వేయర్.
☛ దర్జీ, కార్పెంటర్, ఇటుకల తయారీ, గోల్డ్‌స్మిత్, దోబీ, బొమ్మల తయారీ, బార్బర్ .
☛ **అకడమిక్:** బేసిక్ పైథాన్ ప్రోగ్రామింగ్, అమెజాన్ వెబ్ సర్వీసెస్, ట్యాలీ, కమ్యూనికేషన్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, అర్థమెటిక్-రీజనింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆర్కిటెక్చర్, ఎలక్ట్రికల్.

EENADU Classifieds

AGRI BUSINESS

NURSERY

PROFESSIONAL SERVICES

VAASTU

REAL ESTATE

GENERAL

BUSINESS SERVICES

BUSINESS OFFER

WANTED

FOR SALE

For Sale Excellent Condition overhead 15T Crane, Injection Moulds for Jumbo, F&V Milk Etc. for more details Contact @ 9904944615 or mail to tarkesh1patel@yahoo.co.in

CONSULTANCY SERVICES

We provide consultancy services for contractors working on road projects at pan India level. Interested parties may contact us at vaishno.corporatecommunications@gmail.com

BUILDING CONSTRUCTION

WATER PROOFING

EDUCATION

TUITIONS

H&H Tuitions CBSE, ICSE, State Syllabus Maths & Other Subjects Tuitions Centre for 6 to 10th Classes. Online Tuitions also available. Gnt. 80191 67167.

COACHING CENTRES

DISTANCE EDUCATION

HOME NEEDS

MOSQUITO SCREENS

Fiber Glass Netlon Designer Mosquito Screens Flegent Colour Detachable Washable Free Estimation. Durga Prasad. 86340 02257, 98495 69111.

PEST CONTROL

INDUSTRY

MACHINERY FOR SALE

GEN Samrat Ph:9246249543, 9000688888.

FLAT FOR SALE

TADEPALLI

AMARAVATHI ROAD

A.T.AGRAHARAM

2BHK - 1226 sft & 3BHK - 1575 sft Deluxe premium new flats; ready to accupy @ SBI colony, near MNR convention Hall, A.T.Agraharam extn, Guntur. 98482 94559.

BRODIPET

2BED room flat 1200 sq.ft. E/F at Sarada Homes, 2/14 Brodipet Interior works finishing stage Cont: 94400 10110.

GUJJANAGUNDLA

MANGALAGIRI

NALLAPADU ROAD

INNER RING ROAD



TENALI

GENERAL

Ready to occupation full finished 2BHK flat's, Green park apartment, Nallapadu, 1230 sq ft. All are E/F, Rera, GMC Approved, Cell: 97010 78858.



HOUSE FOR SALE

AMARAVATHI ROAD

BAPATLA

BRODIPET

House for sale at 5/21 Brodipet, Guntur 35ft X 55.6ft (215.83yards), South and North Roads, price 60000 yard, Ph:8008999399.

KOTHAPETA

OLD GUNTUR

INNER RING ROAD

TENALI

GENERAL

LAND FOR SALE

GENERAL

25 Acers Farm Land Sale @ Pidugurala A.P (Amaravathi) 18 Lakhs per Acer. Cont: 9908228185.

PLOT FOR SALE

AMARAVATHI ROAD

KOTHAPETA

NALLAPADU ROAD

NARASARAOPETA

TENALI

GENERAL

Guntur to Vijayawada Highway Rain Tree Building Opposite, 460 Sq.Yds. Highway 4th Site. Cont: Direct Owner Venkatesh - 9705999995.

COMMERCIAL SPACE FOR SALE

GENERAL

9493445666

SHOP FOR SALE

GENERAL

Guntur Arundelpet 9/3 of south facing new commercial space. Ph: 9885796021, 8500445720.

LEASE

GENERAL

LEASE/ RENT

GENERAL

94408 40509
93478 76171
94948 05749

WANTED

GENERAL

TO LET

3bhk, Suryachandra Apartments, Brodipet, 1/17, Guntur. Cell No: 98499 55036 Tolet.

Brodipet Indp E/F 6 Rooms 1000 Sft Two WRs Open Car Parking Govt/PSU Employees Brahmin/Vysya Families only 94910 44465 / 94949 58137.

3bhk furnished flat for rent@ 4/2 Pandaripuram, Guntur. With 4 Ac's, 2 Geyser, Chimney, Aquaguard, contact Ph: 93986 50728.

2 BHK FLAT For TOLET
Manjeera Monarch Vishnu block Super Luxury flat 2 plus 1 bed, leaving room National Highway between near TDP office & Police Head Quarters at Vaddeswaram flat for tolet. All facilities well kitchen, fridge, Dinining Table, 6 x 6 beds,TV, Pooja mandir etc.
9491926525

800sft, 1st ఫ్లోర్, Employee's family, Nr. MAX showroom, Brundavan Gardens, Guntur. 91544 07814.

3 BHK Indep House, Semi furnished, car parking only for Employee's family.

COMMERCIAL

GODOWN for rent 7000 sft with metal roof top & separate good office room available at Kamma Sesaiah grounds, main road, Etukuru road, Guntur. Ph: 99484 77544.

80991 11517

SECOND SALE

JOBS

Wanted Field Assistants for Banking work. Guntur local male persons only: 63095 33476.

Wanted Qualified & Experienced academic Incharges, Teachers for I to V Classes all Subjects, PET & Receptionist (with computer knowledge) Sumedha High School, NGGO's colony, Guntur. 94408 84154.

TADEPALLI TVS showroom requires fresh & exp Service, Sales TL, Exec's, telecallers, computer operators. Sal: 12k+. Ph: 91331 98889.

Wanted Nursery 2nd Experienced Mother Teachers, 3rd - 7th Telugu, Science Teachers. C.R. English Medium School, Old Guntur. 89498 99938.

Wanted Teachers to Teach English, Hindi, Maths, Science for 1st to 7th. Sri Pavan EM School, Near Chuttugunta, Guntur. 98480 53925.

Wanted Male/Female Accountant with 1+ 2 Yrs of exp. B.Com with Tally & Gst working exp. Time: 9AM - 7PM. Sal: 15k-20k. 98480 18386.

ASTRO Vision 3D Planetarium company Required Marketing executives experience 1year. Work at Guntur Dist. OFC: brundavangardens, gnt. 89198 90235.

Wanted Accountant Q: Graduate/CA or CMA Inter with experience of Accounts in Tally and Having MS Excel, Word Knowledge to work at cold Storage & Chillies Business at Guntur. 93941 52990.

Urgently Need Reception Cum Councillor in Vaddeswaram (Tadepally) Contact: 88854 55477.

To Be Continued P.No: 16



బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73135, వేమూరు: 91107 837382

? జంపనిలో గరువు పొలాలకు వెళ్లే మండల పరిషత్తు రోడ్డు పక్కన పాడైన విద్యుత్తు నియంత్రికను, ఓ బండరాయిని వేశారు. దీంతో ఈ మార్గం నుంచి వెళ్లే వారికి ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి వాటిని తొలగించాలి.

- స్థానికుడు, జంపని

✔ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతాం.

- శేఖర్, ఈవోపీఆర్డీ. -న్యూస్‌టుడే, వేమూరు

నిజాంపట్నం ఎంఈవోగా శోభాచందు

నిజాంపట్నం, న్యూస్‌టుడే: నిజాంపట్నం మండల విద్యాశాఖాధికారిగా శోభాచందు శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గుంటూరు జిల్లా పొన్నూరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఎంఈవో-2 శేషగోపాలం, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు ఎంఈవోను అభినందించారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలకు డిమాండ్

కర్లపాలెం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తెదేపా మండలాధ్యక్షుడు ఏపూరి భూపతిరావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు గుంపుల కన్నయ్య, నేతలు మేకల యిర్మియ, బెజ్జం వెంకటేశ్వర్లు ఎస్సై రవీంద్రకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ ఏడాది మే 12న అప్పటి తెదేపా ఎమ్మెల్యే అభ్యర్థి నరేంద్రవర్మను ఉద్దేశించి కట్టావాదకు చెందిన మార్పు రత్నం అసభ్యపదజాలంతో దూషించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పర్యాటకరంగ అభివృద్ధికి సహకరించండి



పర్యాటక కార్పొరేషన్ ఛైర్మన్ బాలాజీని సత్కరిస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి సహకరించాలని ఏపీ పర్యాటక కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ కోరారు. పర్యాటక కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బాలాజీని ఎంపీ శనివారం కలిసి సత్కరించారు. సూర్యలంక, వాడరేవు బీచ్‌ల్లో కొత్త రిసార్ట్స్, మూడు నక్షత్రాల హోటళ్లు నిర్మించాలని కోరారు.

పరిశ్రమలు ఏర్పాటుకు ప్రోత్సాహం అందిచాలి



ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజుతో ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల: బాపట్లలో కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేసేలా ఏపీఐఐసీ తరఫున భూములు కేటాయించి ప్రోత్సహించాలని సంస్థ నూతన ఛైర్మన్ మంతెన రామరాజును ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కోరారు. అమరావతిలో ప్రమాణ స్వీకారం చేసిన ఏపీ ఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, ఏపీ పర్యాటక కార్పొరేషన్ ఛైర్మన్ బాలాజీ, ఏపీ మారిటైమ్ కార్పొరేషన్ ఛైర్మన్ దామచర్ల సత్య, ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణను ఎమ్మెల్యే శనివారం కలిసి వేర్వేరుగా సత్కరించారు.

నిర్లక్ష్యం.. పొంచిన ప్రమాదం



చింతాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ముందు తక్కువ ఎత్తులో విద్యుత్తు తీగలు

చేతికందే ఎత్తులో విద్యుత్తు తీగలు



కర్లపాలెం పంచాయతీ గౌడపాలెం రోడ్డులో విద్యుత్తు నియంత్రిక చుట్టూ అల్లుకున్న పిచ్చి మొక్కలు

కర్లపాలెం, న్యూస్‌టుడే: విద్యుత్తు అధికారులు ఆయా వారి శాఖకు సంబంధించిన పనులు చేసి గ్రామాల్లో వెలుగులు నింపేవిధంగా ఉండాలి. ఆ చర్యలు మనుషులు, జంతువుల ప్రాణాలు హరించే విధంగా ఉండకూడదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కర్లపాలెం మండల కేంద్రంతో పాటు యాజలి, నల్లమోతువారిపాలెం, పెదగొల్లపాలెం, పేరలి, తుమ్మలపల్లి పంచాయతీల పరిధిల్లో విద్యుత్తు స్తంభాలు ఎక్కువ దూరంతో ఏర్పాటు చేయడంతో తీగలు ప్రమాదకరంగా వేలాడుతూ ఉండటం, విద్యుత్తు స్తంభాలు పక్కకు ఒరిగిపోవడం, నియంత్రికల చుట్టూ పిచ్చిమొక్కలు అల్లుకోవడం వంటి ఘటనలు జరుగుతున్నాయి. చింతాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ఎదురుగా విద్యుత్తు తీగలు తక్కువ ఎత్తులో ఉన్నాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయపడుతున్నారు. యాజలి జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో విద్యుత్తు తీగలకు ముళ్ల పొదలు అల్లుకున్నాయి. పలుచోట్ల విద్యుత్తు నియంత్రికల చుట్టూ పిచ్చి మొక్కలు అల్లుకుని ప్రమాదకరంగా ఉన్నాయి. గాలి వీచినప్పుడు నిప్పురవ్వలు ఎగిసి పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు ఏమి చెబుతున్నాయంటే..

★ విద్యుత్తు సరఫరా అయ్యే తీగలు భూమి నుంచి 19 అడుగుల ఎత్తులో ఉండాలి. ★ 11 కేవీ తీగలు అయితే 20 అడుగులు, 33 కేవీ అయితే 21 అడుగులు ఎత్తులో ఏర్పాటు చేయాలి. ★ గృహాలకు నాలుగు అడుగుల దూరంలో తీగలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ★ నియంత్రికలు 8 అడుగుల ఎత్తులో అమర్చాలి.

తక్షణం చర్యలు తీసుకుంటాం

ఒరిగిన విద్యుత్తు స్తంభాలు మారుస్తాం. తక్కువ ఎత్తులో ఉన్న తీగలను సరిచేయిస్తాం. నియంత్రికల చుట్టూ అల్లుకున్న పిచ్చి మొక్కలు వెంటనే తొలగిస్తాం. వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తాం.

– షేక్ బాషా, ఏఈ, విద్యుత్తుశాఖ

బొబ్బర్లంక దారిలో అవస్థలెన్నో



మోర్తోట శివారు నుంచి బొబ్బర్లంక వెళ్లే రోడ్డు ఇలా..

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె మండలం మోర్తోట లాకుల నుంచి బొబ్బర్లంక వెళ్లే ప్రధాన రహదారి పలుచోట్ల ఛిద్రమైంది. గోతులు ఏర్పడి గులక రాళ్లు లేచి ఉండడంతో రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. లంకెవానిదిబ్బ, రాజుకాల్వ, గంగడిపాలెం, చెన్నుపల్లివారిపాలెం, పిరాట్లంక, చోడాయపాలెం తదితర గ్రామాల ప్రజలు 10 వేల మంది పైగా నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తారు. రహదారిపై గుంతలు కనిపించక రాత్రివేళ తరచూ వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి. గత వైకాపా ప్రభుత్వ అయిదేళ్ల పాలనలో రహదారుల అభివృద్ధిని పెడచెవిన పెట్టిందని విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం రోడ్లను అభివృద్ధి చేయిస్తుందని ప్రజలు నిరీక్షిస్తున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బి రేపల్లె ఏఈ విద్యాసాగర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో రహదారుల మరమ్మతులకు రూ.6 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపామన్నారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ఆకలి తీర్చుమా..అన్నపూర్ణమ్మా



నిజాంపట్నం: అన్నపూర్ణాదేవిగా..



చావలి వాలేశ్వర స్వామి ఆలయంలో



వలివేరు స్వయం భూయేశ్వరస్వామి ఆలయంలో



కర్లపాలెంలో గాయత్రీదేవిగా..

వైభంగా దసరా ఉత్సవాలు

బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లోని ఆయా గ్రామాల్లో దసరా నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయాలు రంగు రంగుల విద్యుత్తు దీపాలతో శోభయమానంగా అలంకరించారు. మూడోరోజైన శనివారం అమ్మవారు అన్నపూర్ణాదేవి, గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కొన్ని చోట్ల భక్తులు కనకదుర్గమ్మ విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తులు సామూహిక పూజలు పూజలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సామూహిక ప్రదర్శనలు అలరించాయి.

-న్యూస్‌టుడే బృందం



గుళ్లపల్లి గౌడపాలెంలో..



శ్రీ మహర్షి గోశాలలో..



అమృతలూరు: లలితత్రిపుర సుందరీ అలంకరణలో..



వేంకటేశ్వరాలయంలో గాయత్రీదేవిగా



నగరం పూడివాడలో..



కోనేటిపురంలో..



చెరుకుపల్లిలో..



అల్లూరులో శ్రీమహాచండీదేవిగా..



చందోలులో గాయత్రి మహాదేవిగా..



పేటేరులో..



ఇసుకపల్లిలో వైష్ణవిదేవిగా..



కోటిపల్లి దేవాలయంలో..



అగ్రహారం భవానీ మాత ఆలయంలో..



కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



కోదండ రామాలయంలో అలంకృత దుర్గాదేవి



లలితా త్రిపుర సుందరీ దేవిగా..

ఇక్కడ నీళ్లు పట్టేదెలా?



చుండూరు నుంచి మోదుకూరు వెళ్లే మార్గంలో మున్నంగివారిపాలెం వద్ద తాగునీటి కుళాయిలను మురుగు కాల్వలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అక్కడికి వెళ్లి నీరు తెచ్చుకోడానికి స్థానికులు అవస్థలు పడుతున్నారు. పరిస్థితి సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. ఈ విషయమై ఈవోపీఆర్డీ కుమారస్వామిని సంప్రదించగా పంచాయతీ కార్యదర్శితో చర్చించి కుళాయిలను మరో చోట ఏర్పాటు చేయించి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. **-న్యూస్‌టుడే, చుండూరు**

శిథిల భవనం కూల్చరూ



పోతుమర్రులో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం

శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనంతో ప్రమాదం పొంచి ఉంది. పాఠశాలల విలీనం పేరుతో మండలంలోని పోతుమర్రు ఎస్టీ కాలనీ సమీప ప్రాథమిక పాఠశాలలో పిల్లలను ఎస్సీ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాలలో చేర్పించారు. దీంతో పాఠశాల మూతపడింది. ఆ తరవాత దీని గురించి ఎవరూ పట్టించుకోలేదు. భవనం గోడలు దెబ్బతిన్నాయి, శ్లాబు పెచ్చులూడిపడుతోంది. ఇది రోడ్డు పక్కన ఉండడం వల్ల స్థానికులు, ఆ మార్గంలో వెళ్లే వారు ఎండకో, వర్షానికో తలదాచుకోవడానికి అందులోకి వెళితే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. అంతేకాదు భవనం ఖాళీగా ఉండడం వల్ల ఆకతాయిలు మద్యం తాగి జూదం ఆడుతున్నారు. ఈ విషయమై ఎంఈవో వెంకటేశ్వరరావును వివరణ కోరగా భవనాన్ని ఇంజినీరింగ్ అధికారుల ద్వారా పరిశీలించి, తదుపరి చర్యలు తీసుకుంటామని సమాధానం ఇచ్చారు.

-న్యూస్‌టుడే, వేమూరు

మూడింటికి ఒక్కటే మిగిలింది



మండల కేంద్రమైన నిజాంపట్నంలో గుండం చెరువుల వద్ద ప్రజల అవసరాల రీత్యా గతంలో మూడు చేతి పంపులు ఏర్పాటు చేశారు. వాటిలో రెండు పంపుల తల భాగాల్ని గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. వాటిని మరమ్మతుల చేయించడంలో అధికారులు చొరవ చూపలేదు. చేసేది లేక ప్రజలు ఉన్న ఒక్క చేతి పంపు ద్వారానే నీటిని తీసుకెళుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ వద్ద ప్రస్తావించగా పరిశీలించి సమస్య పరిష్కరించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.

-న్యూస్‌టుడే, నిజాంపట్నం

సేవాభారతి సేవలు అభినందనీయం



యంత్రపరికరాలు అందిస్తున్న సేవాభారతి సంస్థ ప్రతినిధులు

చెరుకుపల్లి న్యూస్‌టుడే: చేనేత కార్మికులకు అండగా తక్కువ శ్రమతో ఎక్కువ ఉత్పత్తులు తయారు చేసేందుకు వీలుగా.. కార్మికుల శారీరక శ్రమ తగ్గించేందుకు సేవాభారతి అందిస్తున్న తోడ్పాటు అభినందనీయమని చేనేత నాయకుడు వంగరు శ్రీనివాసరావు అన్నారు. శనివారం విజయవాడకు చెందిన సేవాభారతి స్వచ్ఛంద సంస్థ చెరుకుపల్లిలో పేద కుటుంబాలకు చెందిన 15 మంది చేనేత కార్మికులకు యంత్ర పరికరాలు ఉచితంగా అందించింది. సేవాభారతి నిర్వాహకులు నవీన్ మాట్లాడుతూ కార్మికులు నైపుణ్యం ఉన్నా శారీరక శ్రమ కారణంగా తగినంత నేతపని చేయలేకపోతున్నారని.. దీన్ని అధిగమించే దిశగా తమ సంస్థ కార్మికులకు యంత్రపరికరాలను అందిస్తుందని ఆయన తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



బిట్రా ప్రసాద్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

చెరుకుపల్లి న్యూస్‌టుడే: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని... దీనిలో ఉన్నవారు గర్వపడాలని విశ్రాంత మండల విద్యాశాఖాధికారి అల్లపర్తి ఆంజనేయులు అన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయుడు బిట్రా ప్రసాద్‌ను స్థానిక ఉపాధ్యాయ బృందం సన్మానించింది. చెరుకుపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి అల్లపర్తి ఆంజనేయులు పీఆర్టీయూ జిల్లా నాయకుడు అనగాని నారాయణ, జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు కాటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే: మత్స్యకార సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని నిజాంపట్నం సహాయ సంచాలకుడు భూక్యా సైదా నాయక్ సూచించారు. రేపల్లె మండలం బొబ్బర్లంకలో యానాదులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు యానాది మత్స్యకారులను సంఘాలుగా ఏర్పాటు చేసి చేపల వేటకు అవసరమైన వివిధ రకాల వలలు, పడవలు, ఐస్‌బాక్సులు, చేపల రవాణాకు ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు, పింఛను సదుపాయంపై చైతన్య పరుస్తున్నామని తెలిపారు.

7 నుంచి ప్రజాప్రతినిధులకు శిక్షణ

అమృతలూరు, న్యూస్‌టుడే: మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో గ్రామ పంచాయతీ ఉప సర్పంచులు, పంచాయతీకి ఇద్దరు వార్డు సభ్యుల చొప్పున 7, 8 తేదీల్లో రెండురోజులపాటు శిక్షణ జరుగుతుందని ఎంపీడీవో మారుతీ శేషమాంబ తెలిపారు. సాధారణ పరిపాలన, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సౌకర్యం, ఆర్థిక నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని ఆమె తెలిపారు.

పురపాలక కమిషనర్ నిర్మల్‌కుమార్ బదిలీ

బాపట్ల : పురపాలక కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ బదిలీ అయ్యారు. కేంద్ర సర్వీసు నుంచి ఆయన డిప్యూటేషన్‌పై పురపాలక శాఖకు వచ్చారు. గత జూలైలో బాపట్ల పురపాలక కమిషనర్‌గా వచ్చారు. వైకాపా పాలనలో కేంద్ర సర్వీసుల నుంచి డిప్యూటేషన్‌పై రాష్ట్ర విభాగాలకు వచ్చిన అధికారులను తిరిగి వెనక్కు పంపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో నిర్మల్‌కుమార్‌ను బదిలీ చేస్తూ మాతృశాఖ అయిన కేంద్ర ఆర్థికశాఖ పంపినట్లు తెలిసింది. బాపట్ల పురపాలక సంఘం నూతన కమిషనర్‌గా ప్రొద్దుటూరు నుంచి రామ శ్రీనాథ్‌రెడ్డి రానున్నట్లు సమాచారం.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



మృతుడు నాగరాజు (పాతచిత్రం)

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : మండల పరిధిలోని నాగరాజుకాలులో శుక్రవారం రాత్రి కాల్వలో దూకి గల్లంతైన యువకుడు ఈపూరి నాగరాజు(25) మృతదేహాన్ని గ్రామీణ పోలీసులు శనివారం గుర్తించారు. గ్రామీణ సీఐ కె.గంగాధర్ ఆధ్వర్యంలో ఉదయం నాలుగు పడవలు, గజఈతగాళ్ల సాయంతో కాలువ పరిసరాల ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. కొంతకాలంగా ఎస్ఎన్‌పీ అగ్రహారం ప్రాంతంలో బిర్యాని దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్న నాగరాజు కుటుంబంలో తలెత్తిన వివాదాలతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని బంధువులు పోలీసులకు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ప్రాంతీయ వైద్యశాలకు తరలించి అనంతరం బంధువులకు అప్పగించామని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ చెప్పారు.

పంచాయతీ కార్యదర్శి బాధ్యతల స్వీకరణ

నిజాంపట్నం, న్యూస్‌టుడే: నిజాంపట్నం పంచాయతీ కార్యదర్శిగా మోడి శ్రీనివాసరావు శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈయన కర్లపాలెం పంచాయతీ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయనకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అవీ ఇవీ

ఇంటింటికి ధర్మప్రచారం నిర్వహించండి

గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: ఇంటింటికి ధర్మప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ కోరారు. ఫౌండేషన్ నెల వారీ సమావేశాన్ని శనివారం మండలంలోని గుళ్లపల్లి శ్రీనూకాలమ్మ ఆలయం వద్ద నిర్వహించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

నేడు కంటివైద్య శిబిరం

కనగాల (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని కనగాల బీఈడీ కళాశాల వద్ద ఈ నెల 6న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు హాజీ మహ్మద్ ఖాసీమ్ సాహెబ్, మహమ్మద్ గాలబ్ సాహెబ్ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ కళాశాల కరస్పాండెంట్ అబ్దుల్ సమ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

వైకాపా ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం

ఆరుంబాక (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వైకాపా అభ్యర్థి గౌతమ్ రెడ్డి శనివారం చెరుకుపల్లి మండలం, ఆరుంబాక వద్ద ఆ పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గ బాధ్యుడు ఈవూరి గణేష్ అధ్యక్షతన నేతలు, పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. నేతలు, కార్యకర్తలు గ్రామాల్లో 2021కి ముందు డిగ్రీ పూర్తి చేసిన పట్టబద్రులను గుర్తించి వారు ఓటరుగా పేర్లను నమోదు చేసుకునేలా చైతన్య పరచాలని కోరారు.

జూద శిబిరంపై దాడి

రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే: రేపల్లె లక్ష్మీ టాకీసు సెంటర్లో జూద శిబిరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. జూదం ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని రూ.8,900 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు. జూదరులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని ఆయన తెలిపారు.

యలవర్రులో పల్లెనిద్ర

యలవర్రు, (అమృతలూరు), న్యూస్‌టుడే: అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అమరవర్ధన్ అన్నారు. యలవర్రులో శుక్రవారం రాత్రి పల్లెనిద్ర నిర్వహించారు. గ్రామస్థులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బహిరంగంగా మద్యం తాగరాదని, శాంతి భద్రతలకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఉపాధి హామీ పథకంతో గ్రామాభివృద్ధి

వేమూరు, న్యూస్‌టుడే: జాతీయ ఉపాధి హామీ పథకంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఏపీవో పీవీ సత్యకృష్ణ తెలిపారు. మండలంలోని జంపనిలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులు గుర్తించడంపై గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో సాగునీటి కాల్వలకు మరమ్మతులు చేయడం, పండ్లతోటల పెంపకం, అంతర్గత రోడ్ల అభివృద్ధి తదితర పనులు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

బాధితుడికి ఎమ్మెల్యే రూ.25 వేల సాయం

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల మంత్రి లోకేశ్ క్యాంపు కార్యాలయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ చీరాల మండలం కావూరివారిపాలేనికి చెందిన కోట వెంకటేశ్వరరెడ్డికి ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు. ఆదివారం ఆయన విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడ్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

సామాన్యులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు

రేపు బాపట్లలో విశాఖపట్నం సహకార బ్యాంకు శాఖ ప్రారంభం



మాట్లాడుతున్న బ్యాంకు ఛైర్మన్ రాఘవేంద్రరావు

బాపట్ల, న్యూస్‌టుడే: సామాన్యులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించటమే ధ్యేయంగా విశాఖపట్నం సహకార బ్యాంకు పని చేస్తోందని బ్యాంకు ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు తెలిపారు. పట్టణంలోని బ్యాంకులో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం సహకార బ్యాంకు 54వ శాఖను బాపట్లలో సోమవారం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. విశాఖలో 1916లో బ్యాంకు ప్రారంభమైందన్నారు. 109 ఏళ్లుగా సేవలు అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో 53 శాఖల ద్వారా ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నామన్నారు. 1.08 లక్షల మంది ఖాతాదారులు ఉన్నారని, బ్యాంకు ఆర్థిక లావాదేవీలు రూ.7,623 కోట్లకు చేరుకున్నాయని ఆయన తెలిపారు. బ్యాంకు డైరెక్టర్లు జేవీ సత్యనారాయణమూర్తి, సీహెచ్ కోటేశ్వరరావు, డీసీఈవో వీవీబీ వరలక్ష్మి, జోనల్ మేనేజర్ వీఆర్ సుబ్రహ్మణ్యం, బ్రాంచి మేనేజర్ ఎ.అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

విద్యుత్తు స్తంభం విరిగె.. తీగలు వేలాడే!



బల్లికురవ-చెన్నుపల్లి రహదారిలో విద్యుత్తు స్తంభం చివరి భాగం విరిగింది. దీంతో తీగలు ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్నాయి. రహదారుల వెంబడి గేదెలు, మేకలు, గొర్రెలు నడిచి వెళ్లే సమయంలో కిందకు వేలాడుతున్న తీగల కారణంగా ప్రమాదం పొంచి ఉంది. ఈవిషయమై విద్యుత్తు ఏఈ శ్రీనివాస్ మాట్లాడుతూ సోమవారం నాటికి విరిగిన స్తంభాన్ని సరి చేస్తామన్నారు. -న్యూస్‌టుడే, బల్లికురవ(అద్దంకి)

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? గ్రామంలోని చెరువులో కొందరు అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. తద్వారా చెరువు గోతులమయమై ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.
- రామిరెడ్డి, నూతలపాడు

✔ ప్రస్తుతం గ్రామాల్లో ఎలాంటి తవ్వకాలు జరగడం లేదు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. - ప్రద్యుమ్నకుమార్, ఎంపీడీవో

తెగిన విద్యుత్తు తీగలు బిగింపు

స్పందనకు వందనం

వి.కొప్పెరపాడు(అద్దంకి), న్యూస్‌టుడే: బల్లికురవ మండలం వి.కొప్పెరపాడులో తెగిన విద్యుత్తు తీగలను శనివారం సరి చేశారు. 'ఈనాడు'లో ఈనెల 4న సమస్యను స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తీసుకురాగా ప్రచురితమైంది. దీనికి స్పందించిన విద్యుత్తు ఏఈ శ్రీనివాస్ నేతృత్వంలో తీగలను సరి చేశారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

చీరాల, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చొరవతో పట్టణంలోని గంజిపాలేనికి చెందిన శ్రీరాం బాలాజీ వైద్యఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి రూ.1.50 లక్షలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన చెక్కును బాధితుడికి పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్ శనివారం అందజేశారు.

డ్రైనేజీ శాఖలో ఏఈల బదిలీలు

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: చీరాల డ్రైనేజీ శాఖలో పలువురు ఏఈఈలు బదిలీ అయ్యారు. జొన్నాదుల యజ్ఞ కోటేశ్వరరావు మార్కాపురం, రాంబాబు పిడుగురాళ్ల, అశోక్ ఒంగోలుకు బదిలీ అయ్యారు. వీరి స్థానంలో కొత్తవారిని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడినట్లు ఈఈ మురళీకృష్ణ తెలిపారు.

చెత్త పన్నుకు చెల్లుచీటీ

ఎత్తివేసిన కూటమి ప్రభుత్వం

చీరాల అర్బన్, అద్దంకి, న్యూస్‌టుడే



ఇళ్లలోని చెత్తను కుప్పగా పోస్తున్న కార్మికురాలు(పాత చిత్రం)



క్లాప్ వాహనాలు

వైకాపా ప్రభుత్వ హయాంలో చెత్త పన్ను పురపాలక సంఘాల్లో ప్రజల నుంచి ముక్కు పిండి వసూలు చేశారు... ఎన్డీయే సర్కారు అధికారంలోకి వచ్చిన వెంటనే అమల్లో ఉన్న చెత్త రుసుం వసూళ్లను నిలిపివేసింది... ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది... ఇప్పుడు దాన్ని పూర్తిగా ఎత్తివేసింది.

వైకాపా ప్రభుత్వం 2022 ఫిబ్రవరి నుంచి ఇంటింటి చెత్త సేకరణ విధానాన్ని తీసుకొచ్చింది. దీనికోసం ప్రతినెలా చెత్త పన్ను వసూలు చేసేవారు. నెలకు ఇంటికి రూ.30-60, వాణిజ్య సముదాయాలు, వ్యాపార సంస్థలు తదితర వాటి నుంచి రూ.100 వరకు వసూలు చేశారు. దీనికోసం వాహనాల నిర్వహణ ఒక ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారు. ప్రతి వాహనానికి నెలకు రూ.52 వేలు అద్దె చెల్లించే ప్రాతిపదికన నిర్ణయించారు. ఈ భారం పురపాలక సంఘాలపై పడకుండా ఉండేలా గృహాలు, దుకాణాలు, వాణిజ్య సముదాయాల నుంచి నెలనెలా వసూలు చేయడానికి శ్రీకారం చుట్టారు. ఇళ్ల నుంచి చెత్త సేకరణ కోసం మూడు రంగుల డబ్బాలు సైతం అందజేశారు.

చీరాలలో ఇలా..

సంవత్సరం	వసూలు (రూ.లక్షల్లో)
2021	7,21,540
2022	46,45,700
2023	44,50,090
2024	6,14,460 (ఫిబ్రవరి వరకు)

చీరాలలో కోటికిపైగా వసూలు

చీరాల పురపాలక సంఘం పరిధిలో చెత్త పన్ను కింద ప్రజల నుంచి రూ.కోటిపైగా వసూలు చేశారు. చెత్తను ఇళ్ల నుంచి సేకరించేందుకు ప్రత్యేకంగా క్లాప్ ఆధ్వర్యంలో 11 వాహనాలు సరఫరా చేశారు. 33 వార్డుల్లో ఒక్కొక్క ఇంటి నుంచి రూ.50 గరిష్ఠంగా వసూలు చేయాలని నిర్ణయించారు. 2024 ఫిబ్రవరి వరకు వీటిని ప్రజల నుంచి వసూలు చేశారు. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో నిలుపుదల చేశారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే ఈ రుసుం వసూలు చేయవద్దని మౌఖిక ఆదేశాలు రావడంతో పురపాలక సంఘాల్లో దీన్ని అధికారులు పూర్తిగా నిలిపివేశారు. అద్దంకి పురపాలక సంఘంలో మొత్తం 20 వార్డులుండగా పదో వార్డులో ప్రయోగాత్మకంగా చెత్త పన్ను వసూలు ప్రారంభించారు. ఒకటిన్నర నెలకే ఆ ప్రక్రియను ప్రజాసంఘాలు అడ్డుకోవటంతో వసూళ్లు నిలిపివేశారు. అద్దంకిలో నిత్యం 30 టన్నుల చెత్త సేకరిస్తున్నారు. దీన్ని శింగరకొండ సమీపంలోని అద్దంకి కొండకు తరలిస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం చెత్త పన్నును ఎత్తివేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ఆధ్యాత్మిక ఉపన్యాసం

చీరాల, న్యూస్‌టుడే: పట్టణంలోని స్వర్ణరోడ్డులో ఉన్న లయన్స్ క్లబ్ భవనంలో ఆదివారం సాయంత్రం ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో 'కృష్ణావతార తత్వం' అనే అంశంపై ఆధ్యాత్మిక ఉపన్యాసం నిర్వహించనున్నట్లు ఆ పీఠం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరావు, ప్రసాదరావు తెలిపారు. సాయంత్రం ఆయిదున్నర గంటలకు ఇది జరుగుతుందని, భక్తులు హాజరుకావాలని కోరారు.

నేడు సంతమాగులూరులో మంత్రి పర్యటన

సంతమాగులూరు, న్యూస్‌టుడే: సంతమాగులూరు మండలంలో విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం పర్యటించనున్నట్లు క్యాంపు కార్యాలయ ప్రతినిధులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నెస్పీ అద్దంకి బ్రాంచి కాలువపై ఉదయం 10.45 గంటలకు మంత్రి పర్యటించనున్నారు. అడవిపాలెం 18/0 మైలు వద్ద రైతులతో సాగు నీటి సమస్యలపై చర్చించనున్నారు. అనంతరం 11.45 గంటలకు ఏల్చూరులోని మంత్రి అతిథి గృహంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సమస్యలపై కమిషనర్‌కు వినతి



కమిషనర్‌ను కలిసి 8వ వార్డు తెదేపా నేతలు

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి పురపాలక సంఘం పరిధిలోని 8వ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తెదేపా నేతలు శనివారం కమిషనర్ డి.రవీంద్రను కలిసి వినతి పత్రం అందించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో బిళ్లపాటి రామాంజనేయులు, దొప్పలపూడి దుర్గాప్రసాద్, శివకృష్ణ, నర్రా సుబ్బారావు తదితరులు ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

చినగంజాం, న్యూస్‌టుడే: నిబంధనలకు వ్యతిరేకంగా పెదగంజాంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం పట్టుకున్నట్లు ఎస్సై శీలం రమేష్ తెలిపారు. వీటిని సీజ్ చేసినట్లు చెప్పారు. డ్రైవర్లు, నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

నామ్ రహదారిపై నిరంతరం వాహనాల రద్దీ



అడ్డదిడ్డంగా వాహనాలు

అద్దంకి, న్యూస్‌టుడే: అసలే ఇరుకు రహదారి.. ఆపై పెరిగిన వాహనాల రద్దీ.. నిరంతరం వాహనాలు నిలిచిపోతుండటంతో చోదకులు అసహనానికి గురవుతున్నారు. నామ్ రహదారిపై అద్దంకి పట్టణంలో ఇలాంటి దృశ్యాలు సర్వసాధారణంగా మారాయి. నామ్ రహదారిపై చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు అద్దంకి మీదుగా వాహనాలు ప్రయాణిస్తుంటాయి. అలాగే రాయలసీమ నుంచి అమరావతి రాజధానికి వెళ్లే రహదారి అద్దంకి మీదుగా వెళుతోంది. ఈ రెండు రహదారులు పట్టణంలోని భవానీకూడలి వద్ద మలుపులు తిరుగుతున్నాయి. సాఫీగా వాహనాలు వెళ్లేందుకు అనువైన అవకాశం లేదు. వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని గతంలో పోలీసు కానిస్టేబుల్ ఉండేవారు. ఇపుడు సిబ్బంది కొరత కారణంగా పోలీసులు ఆవైపు దృష్టి సారించడం లేదు. ఫలితంగా ఒక్కోసారి 15-30 నిమిషాల పాటు ట్రాఫిక్ నిలిచిపోతుంది. శింగరకొండకు భక్తులు మంగళ, శనివారాల్లో అత్యధికంగా వెళుతుంటారు. ఆయా వాహనాల రద్దీ ఒకేసారి పెరగడంతో శనివారం భవానీ కూడలి నుంచి 500 మీటర్ల పొడవునా నాలుగువైపులా వాహనాలు నిలిచాయి. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన రంగ ప్రవేశం చేసి, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.

వీఆర్‌ఏల సంఘ నూతన అధ్యక్షుడిగా అనిల్‌కుమార్



చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం మండల వీఆర్‌ఏల సంఘం నూతన అధ్యక్షుడిగా పెదగంజాం-2 వీఆర్‌ఏ మాచవరపు అనిల్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల రెవెన్యూ కార్యాలయంలో శనివారం ఎన్నిక జరిగిందని అనీల్‌కుమార్ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా మేడికొండ శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని చెప్పారు. నూతన కమిటీ ప్రతినిధులకు ఉప తహసీల్దార్ యు.శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు. వీఆర్‌ఏలు మేడికొండ సుబ్బారావు, షేక్ నాజర్‌వలి, షేక్ సుభాని, లుడియమ్మ, షాలెంరాజు, వెంకట్రావు పాల్గొన్నారు.

కలవకూరులో పోలీసుల పల్లెనిద్ర



సచివాలయం వద్ద స్థానికులతో మాట్లాడుతున్న సీఐ కృష్ణయ్య

కలవకూరు(అద్దంకి), న్యూస్‌టుడే: విజువల్ పోలీసింగ్‌లో భాగంగా అద్దంకి పోలీసులు శుక్రవారం రాత్రి కలవకూరులో పల్లెనిద్ర నిర్వహించారు. సీఐ పి.కృష్ణయ్య, ఎస్సై సీహెచ్.ప్రవీణ, సిబ్బంది పాల్గొన్నారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణం ఉండేలా సహకరించాలన్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు, చరవాణిలో అభ్యంతరకర సందేశాలు పంపడం వంటి చర్యలకు దూరంగా ఉండాలన్నారు. యువకుల్ని నియంత్రించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని చెప్పారు. తెదేపా మండల అధ్యక్షుడు కఠారి నాగేశ్వరరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తీరప్రాంత వాసులకు శాశ్వత రక్షిత నీటి సరఫరా



వాడరేవు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య, పక్కన దాత స్వామి రామానంద సరస్వతి

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: తీర ప్రాంత వాసులకు శాశ్వతంగా రక్షిత నీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. చీరాల మండలం వాడరేవులో స్థానికులు, మత్స్యకారులకు సౌకర్యార్థం స్వామి రామానంద సరస్వతి ఆధ్వర్యంలో రూ.15 లక్షల సాయంతో మంచి నీటి ట్యాంకులు, ట్రక్కుల ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు ఏ కష్టం వచ్చినా తల్లిలా ఆదుకోవడానికి స్వామి రామానంద సరస్వతి ముందుకు రావడం అభినందనీయమన్నారు. అడిగిన వెంటనే రెండు కొత్త ట్రాక్టర్లు, ట్యాంకర్లను సమకూర్చారన్నారు. వీటి నిర్వహణ తానే స్వయంగా పర్యవేక్షిస్తానన్నారు. వాడరేవులో పారిశుద్ధ్య నిర్వహణకు నిధులు కొరతగా ఉన్న దశలో పాత టోల్‌గేటును పునరుద్ధరిస్తే తాను డబ్బులు వసూలు చేస్తున్నానంటూ అధిష్ఠానానికి కొందరు ఫిర్యాదు చేశారన్నరు. తనపై వస్తున్న ఆరోపణలను ప్రజలే తిప్పికొట్టాలని కోరారు. అనంతరం స్వామి రామానంద సరస్వతిని సన్మానించారు. టోల్ గేటు ద్వారా వచ్చిన డబ్బుతో కార్మికులకు జీతాలు అందజేశారు. తొలుత ఆశ్రమంలో ట్రాక్టర్లను నడిపి ప్రారంభించారు. కార్యక్రమంలో పిక్కినారాయణ, ట్రస్టు ఉపాధ్యక్షుడు కొండూరి కృష్ణారావు, తెదేపా నాయకులు, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

రేడియం స్టిక్కర్ల ఏర్పాటు



హైవే అధికారులతో మాట్లాడుతున్న ఎస్సై రఫీ

మేదరమెట్ల, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై రాత్రి వేళల్లో డివైడర్ దిమ్మెలు, సూచిక బోర్డులు కనిపించేలా రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసినట్లు మేదరమెట్ల ఎస్సై మహమ్మద్ రఫీ అన్నారు. కొరిశపాడు మండలంలోని పి.గుడిపాడు నుంచి తిమ్మనపాలెం వరకు జాతీయ రహదారి సిబ్బందితో కలిసి ఆయన హైవేను శనివారం పరిశీలించారు. అవసరమైన చోట డివైడర్లకు, సూచిక బోర్డులకు రేడియం స్టిక్కర్లను అంటించారు. హైవే అధికారి గిరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులు అప్రమత్తంగా మెలగాలి

పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: వాహనచోదకులు అప్రమత్తంగా వ్యవహరించి ప్రమాదాల బారినపడకుండా గమ్యస్థానాలకు చేరాలని ఎస్సై మాల్యాద్రి కోరారు. శనివారం మండలంలోని కొల్లావారిపాలెం వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశానుసారం ద్విచక్రవాహనాలు, కారు వంటివి తనిఖీ చేశారు. డ్రైవర్ల ధ్రువపత్రాలు పరిశీలించారు.

పవనసుతునికి పూజలు



ఇంకొల్లు, న్యూస్‌టుడే: పొలిమేర వీరాంజనేయ స్వామి క్షేత్రంలో దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం విశేష పూజలు జరిగాయి. ఉదయం భక్తులు పెద్ద ఎత్తున స్వామికి తమాల పత్ర పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లతో మొక్కులు తీర్చుకున్నారు. నూతన వాహనాలకు పూజలు చేయించారు. పశువులకు వ్యాధులు రాకుండా ప్రదక్షిణలు చేయించారు. సామాజిక సత్రాల్లో భక్తులకు అన్నదానం చేశారు. అలహరి రమేష్ పౌరోహిత్యం వహించారు.

హనుద్వాహనంపై శ్రీవారు



చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం పురాతన శ్రీభూసమేత భావనారాయణ స్వామి 17వ వార్షికోత్సవంలో భాగంగా మూడో రోజైన శనివారం పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, సాయంత్రం హనుద్వాహనంపై శ్రీవారికి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వేటపాలెంలో కాత్యాయినిగా..



ఆమోదగిరిపట్నం శివాలయంలో బాలాత్రిపుర సుందరిగా..




అద్దంకిలో శ్రీలలితాదేవిగా



దత్తపాదుకాక్షేత్రంలో శ్రీగాయత్రిదేవిగా



జే పంగులూరు భీమలింగేశ్వరస్వామి గుడిలో..



మార్టూరు పాండురంగ స్వామి ఆలయంలో..



కారంచేడులో గాయత్రిదేవిగా..



ద్రోణాదులలో లలితా త్రిపుర సుందరీదేవిగా..



మార్టూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



మార్టూరు: అన్నపూర్ణాదేవిగా..



పర్చూరులో..



నూతలపాడులో..



చినగంజాంలో..



దైవాలరావూరులో..

అన్నపూర్ణేశ్వరీ పాహిమాం

చీరాల అర్బన్, వేటపాలెం, అద్దంకి, జే పంగులూరు, పర్చూరు, కారంచేడు (మార్టూరు), యద్దనపూడి, న్యూస్‌టుడే: చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లోని దేవాలయాల్లో దేవీ శరన్నవరాత్రులను వైభవంగా నిర్వహిస్తున్నారు. మూడోరోజైన శనివారం అమ్మవారు అన్నపూర్ణేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం, రాత్రికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల్లో అమ్మవారి ఆలయాలు దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి.



ఇంకొల్లు: అమ్మవారికి పూజలు



చినగంజాం: బతుకమ్మ పూజల్లో మహిళలు

ఛైర్మన్లకు అభినందనలు

అద్దంకి, పర్చూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లుగా బాధ్యతలు స్వీకరించిన వారిని మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, ముత్తుముల అశోక్‌రెడ్డి, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తదితరులు అభినందించారు. మారిటైమ్ ఛైర్మన్ దామచర్ల సత్య, పర్యాటక సంస్థ ఛైర్మన్ నూకసాని బాలాజీ, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల కమిటీ ఛైర్మన్ మంతెన రామరాజు తదితరులను వీరు అభినందించారు.

పర్యటనలు.. పరామర్శలు



బూదవాడలో అంజిరెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి గొట్టిపాటి

★ జే పంగులూరు మండలం బూదవాడ, బల్లికురవ మండలం రాజుపాలెం, కొత్తమల్లాయపాలెం గ్రామాల్లో పర్యటించిన మంత్రి గొట్టిపాటి పలు శుభకార్యక్రమాల్లో పాల్గొన్నారు. ★ అనంతరం జే పంగులూరు మండలం బూదవాడలో శుక్రవారం నీటికుంటలో పడి మృత్యువాత పడిన ఇద్దరు చిన్నారుల తాతయ్య అంజిరెడ్డిని మంత్రి గొట్టిపాటి పరామర్శించారు. -న్యూస్‌టుడే, అద్దంకి

బాధితుడికి ఎమ్మెల్యే రూ.25 వేల సాయం

చీరాల గ్రామీణం: ఇటీవల మంత్రి లోకేశ్ క్యాంపు కార్యాలయంలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ చీరాల మండలం కావూరివారిపాలేనికి చెందిన కోట వెంకటేశ్వరరెడ్డికి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు. ఆదివారం ఆయన విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడ్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

నేడు సీతారాం ఏచూరి సంస్మరణ సభ

మార్టూరు, న్యూస్‌టుడే: సీపీఎం జాతీయ నేత సీతారాం ఏచూరి సంస్మరణ సభ ఆదివారం మార్టూరులో నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల హనుమంతరావు శనివారం తెలిపారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఈ సభ ఉంటుందని అన్ని వర్గాల ప్రజలు, పార్టీ నేతలు హాజరుకావాలని కోరారు.

విద్యాసంస్థల అధినేతకు పురస్కారం

మార్టూరు, న్యూస్‌టుడే: మండలంలోని వలపర్లలో నేతాజీ విద్యాసంస్థల ద్వారా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతున్న సంస్థ డైరెక్టర్ సయ్యద్ కరీముల్లాకు విశిష్ట విద్య సేవా పురస్కారం దక్కింది. శనివారం జగ్గయ్యపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకున్నట్లు వెల్లడించారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం

మార్టూరు, న్యూస్‌టుడే: ప్రజలు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉంటూ అవగాహనతో మెలగాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ బి.వి.సాగర్ కోరారు. శనివారం మార్టూరులోని టుబాకో గ్రేడింగ్ కేంద్రం వద్ద మహిళలకు ఈ వ్యాధిపై అవగాహన పెంపొందించారు. ప్రతినిధులు కె.దుర్గ, రూత్‌సల్మా తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన బ్యాంకింగ్ సేవలు

బాపట్ల, న్యూస్‌టుడే: సామాన్యులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించటమే ధ్యేయంగా విశాఖపట్నం సహకార బ్యాంకు పని చేస్తోందని బ్యాంకు ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు తెలిపారు. పట్టణంలోని బ్యాంకులో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం సహకార బ్యాంకు 54వ శాఖను బాపట్లలో సోమవారం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

ఈ-పంట నమోదు పరిశీలన

యద్దనపూడి, న్యూస్‌టుడే: వ్యవసాయ శాఖ ఆదేశానుసారం ఈ-క్రాప్ నమోదుపై రెవెన్యూ అధికారులు గ్రామాల్లో పర్యటించారు. శనివారం యద్దనపూడి, యనమదల గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న పంటలపై ఈ- క్రాప్ నమోదు తీరును ఉప తహసీల్దార్ ఇ.మస్తాన్‌రావు పరిశీలించారు. వెంట వ్యవసాయ సహాయకులు వినయ్‌దత్తా, నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

కారంచేడు, న్యూస్‌టుడే: మండలంలోని రైతులు ఈ -క్రాప్ నమోదు చేయించుకున్న పిదప తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏవో సుధీర్‌బాబు కోరారు. గ్రామంలోని రైతు సేవా కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

కలవకూరు(అద్దంకి), న్యూస్‌టుడే: రబీలో పంటలు సాగు చేసిన రైతులు ఈకేవైసీ నమోదుకు సోమవారంతో గడువు ముగియనున్నట్లు ఏవో కె.వెంకటకృష్ణ తెలిపారు. కలవకూరులో పొలం పిలుస్తోంది పునఃసమీక్ష శనివారం నిర్వహించారు. మండలంలో సాగుచేసిన 8355 ఎకరాలను ఈ పంట నమోదు చేసినట్లు ఆమె చెప్పారు. ఈకేవైసీ 99.6 శాతం పూర్తి కాగా పది మంది రైతులు చేయించుకోవాల్సి ఉందన్నారు.

'వైకాపా ప్రభుత్వం చేతివృత్తులకు పైసా ఇవ్వలేదు'

గుంటూరు, న్యూస్‌టుడే: చేతి వృత్తిదారులను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలతో మభ్యపెడుతున్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. స్థానిక కొత్తపేటలోని సీపీఐ కార్యాలయంలో శనివారం చేతి వృత్తిదారుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యంతో కార్పొరేట్ చేతుల్లో చాలీచాలని కూలీలతో అతి దుర్భరమైన జీవితాలను చేతివృత్తిదారులు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేతివృత్తిదారులను ఆదుకోవడానికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో 56 చేతివృత్తులు, కులవృత్తుల కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఒక్క పైసా నిధులు ఇవ్వలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం చేతివృత్తిదారులను ఆదుకోవటానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు లింగయ్య, జంగాల అజయ్‌కుమార్, కన్నయ్య, బాలాజీ, పోతులయ్య, వెంకటరావు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో యువత

- అద్దంకిలో నలుగురి పట్టివేత
- 1200 కిలోలు స్వాధీనం

అద్దంకి, న్యూస్‌టుడే

గంజాయి మత్తులో యువత తేలియాడుతున్నారు. ఈ మత్తులో ఉన్న యువకులు ఏం మాట్లాడుతున్నారో, ఎంత దూరం వెళ్తున్నారో తెలియని విధంగా తయారవుతున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఈ వ్యాపారం విచ్చలవిడిగా వ్యాపించింది. దీన్ని విక్రయించేవారు, వినియోగించేవారు అంతా యువకులే కావటంతో పాటు పైసెప్పు విద్యాలయాలు ... ఈక్రమంలో అద్దంకి కేంద్రంగా కొందరు యువకులు తెలిగ్గా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ మత్తు పదార్థం విక్రయిస్తూ పోలీసులకు చిక్కారు. వారి నుంచి భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

అద్దంకి పట్టణం ఆణ్యదయనగర్ సమీపంలో శాశ్వతంగా మండలానికి చెందిన యువకుడు పణీందర్, అతని స్నేహితుడు బాలహరిప్రసాద్ చిన్న దుకాణాలు నడుపుతున్నారు. వీరికి మార్టూరు మండలం నాగరాజుపల్లికి చెందిన కారు పోడకదు ప్రకాశ్ తోడయ్యాడు. నర్సీపట్నంకు చెందిన రాజేశ్వరిని 2019లో వివాహం చేసుకున్న ప్రకాశ్ అక్కడే గంజాయి విక్రయదారులతో పరిచయం పెంచుకున్నాడు. అక్కగారింటికి రాకపోకలు సాగించే క్రమంలో గంజాయి అమ్మకాలు ప్రారంభించాడు. అద్దంకి పట్టణానికి చెందిన రాజాబండ బబ్లిక రవి మండలం బొగ్గులకొండ వద్ద గల స్వామీజీతో పరిచయం పెంచుకున్నాడు. ఆయన ద్వారా అద్దంకిలో గంజాయి విక్రయాలు జరుపుతున్నారు. ఈ నలుగురిని రెండు రోజుల క్రితం అద్దంకి పోలీసులు అదుపులోకి తీసుకుని 1,200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.



అద్దంకి పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి సంచులు

- 2023 జులైలో అద్దంకిలో గంజాయి విక్రయిస్తున్న, వినియోగిస్తున్న 13 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో శింగరకొండకు చెందిన సుబ్బారావు, అతనికి గంజాయి సరఫరా చేసిన బల్లికురవ మండలం వి.కొప్పెరపాడుకు చెందిన మరో వ్యక్తిని అరెస్టు చేశారు. 1,200 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సేవిస్తున్న 11 మందిపై కేసు నమోదు చేశారు.
- ఈ ఏడాది ఫిబ్రవరిలో కడప జిల్లా ప్రొద్దుటూరు నుంచి విజయవాడ వెళుతున్న ట్రావెల్ బస్సులో ఇద్దరు యువకులు సంచుల్లో పోలీసులు తనిఖీ చేయగా కిలో గంజాయిని గుర్తించారు. వారిపై అద్దంకి పోలీసులు కేసునమోదు చేశారు.

బిడ్డల ప్రవర్తన గమనిస్తుండాలి

పిల్లల నడవడిక, ప్రవర్తనను తల్లిదండ్రులు నిరంతరం గమనిస్తుండాలి. ఏమైనా అనుమానం కలిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ప్రత్యేకించి గంజాయి, మాదక ద్రవ్యాలు ఇటు యువకులు తెలిగ్గా ఆకర్షితులవుతున్నారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తుంది. బాధ్యత గల పౌరులుగా ఇలాంటి అంశాలు దృష్టికి వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి. - పి.కృష్ణయ్య, అద్దంకి సీఐ

ఎస్టీలకు ఆధార్‌కార్డుల జారీకి ప్రత్యేక డ్రైవ్

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో ఎస్టీలందరికీ ఆధార్‌కార్డులు జారీకి ఈ నెల 15 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ వెంకట మురళి ఆదేశించారు. ఎస్టీల సంక్షేమంపై కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన శనివారం మాట్లాడారు. దీనిపై అన్ని పంచాయతీల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని పేర్కొన్నారు. ఎస్టీల ఆవాస ప్రాంతాల్లో అధికారులు వీధి విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో 65 వేల మంది ఎస్టీలు ఉన్నారని తెలిపారు. 42 గ్రామాల్లో వీరి జనాభా ఎక్కువగా ఉంటున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఎస్టీ కాలనీల్లో కనీస సదుపాయాలు కల్పించాలని చెప్పారు. ఆధార్‌కార్డులు జారీ చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేలా చూడాలన్నారు. జనన ధ్రువీకరణ పత్రాల ప్రక్రియపై 9,10కు తహసీల్దార్లు పంచనామా నిర్వహించాలన్నారు. తక్షణమే ఎస్టీలకు జనన ధ్రువీకరణ పత్రాలను ఆర్డీవోలు జారీ చేయాలని ఆదేశించారు. సచివాలయాల్లో 95 ఆధార్ కేంద్రాలు నడుస్తున్నాయని వాటిని ఎస్టీలు అధికంగా ఉన్న ప్రాంతాలకు తరలించాలన్నారు. ఇంటి స్థలాలు, రేషన్‌కార్డులు లేని ఎస్టీలను గుర్తించి తక్షణమే వారికి మేలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. చేపల వేటకు వెళ్తున్న 355 మంది ఎస్టీలను గుర్తించి సొసైటీలుగా ఏర్పాటు చేస్తామన్నారు. 50 ఏళ్లు దాటిన ఎస్టీలకు ఎన్టీఆర్ భరోసా పథకం కింద నెలకు రూ.4 వేల పింఛను మంజూరు చేస్తామని తెలిపారు. డీటీవో ప్రకాశరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ వెంకట మురళి

రూ.కోటిన్నరతో సేవా కార్యక్రమాలు

బాపట్ల, న్యూస్‌టుడే: వరద ప్రభావిత కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లంక గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలకు రూ.కోటిన్నరతో ఆర్థిక సాయం, ఆరోగ్య సేవలు అందిస్తామని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కార్యదర్శి ఆల్లాడి దేవకుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకట మురళిని డీబీఆర్‌సీ ప్రతినిధులు శనివారం కలిసి లంక గ్రామాల్లో చేపట్టనున్న సేవా కార్యక్రమాలు వివరించారు. వరదతో తీవ్రంగా నష్టపోయిన ఎస్సీ, ఎస్టీలకు ఇతోధిక సాయం చేయాల్సి ఉందన్నారు. ఐదు వేల కుటుంబాలకు నిత్యావసరాలు, గృహోపకరణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. రెండు వేల కుటుంబాలకు ఆర్థిక సాయం చేస్తామని పేర్కొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ డీబీఆర్‌సీ వరద బాధితులకు సాయం చేయటానికి ముందుకు రావటం అభినందనీయమన్నారు. సంస్థ ప్రతినిధులు శామ్యూల్ అనిల్‌కుమార్, ఉమామహేశ్వరరావు, భగవాన్‌దాస్ పాల్గొన్నారు.

ఖేలో ఇండియా ఖోఖో క్రీడాకారిణుల ఎంపిక

జే పంగులూరు, న్యూస్‌టుడే: సౌత్‌జోన్ ఖేలో ఇండియా అండర్-17, -14 సంవత్సరాల ఖోఖో క్రీడాకారిణులను జే పంగులూరు ఎంఎస్ అండ్ బీవీఎస్ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం ఎంపిక చేశారు. ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి, రిఫరీబోర్డు కన్వీనర్ ఎంపీఎస్ ఎస్.ప్రసాద్, జె.పాల్, లక్ష్మీనారాయణ, ఎం. పవన్‌కుమార్, సోమేశ్వరరావు, రాముబాబు, సావిత్రమ్మ, లత, రత్తయ్య, శ్రీనివాసరావు, రాంబాబు, వీరాంజనేయులు, రామారావు, సోమశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 100 మంది క్రీడాకారిణులు పాల్గొన్నారు. ఇందులో అండర్-17, అండర్-14 విభాగాల్లో 15 మంది చొప్పున ఎంపిక చేశారు. ఎంపికైనవారు ఈనెల 16-18 తేదీల్లో తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగే జాతీయస్థాయి ఖేలో ఇండియా ఖోఖో పోటీల్లో పాల్గొంటారు. వీరికి ఈనెల 7న తేదీ నుంచి నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి క్రీడాప్రాంగణంలో శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి తెలిపారు. కోచ్‌గా సుకుమార్ వ్యవహరించనున్నారు.



అండర్-14 జట్టు

భవానీ, గయాసున్నీసా (నెల్లూరు), హారిక, చందన(శ్రీకాకుళం), యామిని(చిత్తూరు), ధనలక్ష్మి, హారిక, (విజయనగరం), హేమలత, ఐశ్వర్య, గురవమ్మ (ప్రకాశం), ముబీనా(గుంటూరు), హారిత(కడప), గనిలక్ష్మి(తూ.గో), కావేరి(అనంతపురం), వినీత(కృష్ణా), హారిక(కర్నూలు).



అండర్-17 జట్టు

పవిత్ర, ప్రవంతి(నెల్లూరు), జాహ్నవి(విజయనగరం), పురందేశ్వరి, సుస్మిత(ప్రకాశం), స్వప్న(అనంతపురం), తనూజ, భవానీ, తేజశ్రీ(శ్రీకాకుళం), ఆర్యశ్రీ(కర్నూలు), ప్రవంతి(కడప), యస్మిత, మణిచంద్రిక (తూ.గో), అనిత(కృష్ణ), రంగమహాలక్ష్మి(గుంటూరు), జ్యోష్న(విశాఖ), సత్యవతి(చిత్తూరు).

సాంకేతిక సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబరు

బాపట్ల, న్యూస్‌టుడే: సమగ్ర శిక్ష ద్వారా నిర్వహిస్తున్న కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఒప్పంద, పొరుగు సేవల పోస్టుల కోసం ఆన్‌లైన్లో అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్న సమయంలో తలెత్తిన సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కార్యాలయంలో టోల్ ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేసినట్లు ప్రాజెక్టు అదనపు సమన్వయకర్త లక్ష్మీకుమారి తెలిపారు. ఆమె శనివారం మాట్లాడుతూ దరఖాస్తులు ఆన్‌లైన్లో దాఖలు చేసే సమయంలో తలెత్తిన సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్లు 7075039990, 7075159996 లలో సంప్రదించాలని సూచించారు.

50 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

కారంచేడు(మార్టూరు), న్యూస్‌టుడే: పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని మండలంలోని స్వర్ణలో పోలీసులు పట్టుకున్నారు. శనివారం చీరాల నుంచి అద్దంకి వైపు వెళుతున్న వాహనాన్ని తనిఖీ చేయగా 50 బస్తాల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించామని ఎస్సై సురేష్ తెలిపారు. బియ్యం, వాహనాన్ని స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. డ్రైవరును అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు.

మాతృ మరణాల నివారణకు కృషి

బాపట్ల, న్యూస్‌టుడే: మాతృ మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో విజయమ్మ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఇటీవల ఇంకొల్లు, వేల్లటూరు పీహెచ్‌సీల పరిధిలో జరిగిన రెండు మాతృ మరణాలపై సమీక్షించారు. మరణాలకు గల కారణాలు విశ్లేషించారు. గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించాలని ఆదేశించారు. ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే ఆసుపత్రిలో చేర్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సురక్షిత కాన్పులు చేయించాలని పేర్కొన్నారు. డీవో వెంకటేశ్వర్లు, వైద్యాధికారులు రామకృష్ణ హనుమాన్, శేషుకుమారి, సునీత, రోహిణి, దీప, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



వైద్యాధికారులతో సమావేశం నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో విజయమ్మ

చీరలే కంచెగా.. మొక్కజొన్నకు రక్షణగా!

కారంచేడు మండలంలో సాగు చేసిన మొక్కజొన్న పంటను అడవి పందులు నాశనం చేసే అవకాశం ఉండటంతో రైతులు వినూత్నంగా ఆలోచించారు. గతంలో రక్షణ కోసం పంట చుట్టూ ఎలక్ట్రికల్ కంచెను ఏర్పాటు చేసుకునేవారు. దాని వల్ల ప్రమాదాలు చోటుచేసుకోవడంతో ప్రస్తుతం చీరలతో కంచెను ఏర్పాటు చేస్తున్నారు. రాత్రి వేళల్లో గాలికి ఇవి కదలడం వల్ల పందులు రావడం లేదని రైతులు చెబుతున్నారు. దీంతో గతంతో పోలిస్తే పంటనష్టం చాలా వరకు తగ్గిందని కర్షకులు తెలిపారు. -న్యూస్‌టుడే, మేదరమెట్ల



తాళ్లూరు ఎంఈవో ఇంట్లో చోరీ

దంపతులు ఇంట్లో నిద్రిస్తుండగా లోపలకు ప్రవేశించిన దొంగలు

రూ.లక్ష నగదు, 64 గ్రాముల బంగారం అపహరణ

అద్దంకి, న్యూస్‌టుడే: తాళ్లూరు ఎంఈవో ఇంట్లో దొంగలు పడ్డారు. దంపతులు గదిలో నిద్రిస్తుండగా లోపలకు ప్రవేశించిన ఆగంతకులు మరో గదిలోని బీరువాలో దాచుకున్న నగదు, బంగారం అపహరించారు. పోలీసులు అందించిన సమాచారం మేరకు.. ప్రకాశం జిల్లా తాళ్లూరు ఎంఈవోగా జి. సుబ్బయ్య, ఆయన భార్య సుబ్బలక్ష్మి అద్దంకి పట్టణంలోని ఓ ప్రైవేటు విద్యాలయంలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. వాసవీ నగర్ చివర్లోని ఇంట్లో వీరు నివసిస్తున్నారు. ఇంటి కింది భాగం అద్దెకు ఇవ్వగా పైఅంతస్తులో వీరు ఉంటున్నారు. శుక్రవారం రాత్రి ఇంట్లో పడుకున్న దంపతులు శనివారం ఉదయం 5.15 గంటలకు లేవగా చోరీ జరిగినట్లు గుర్తించారు. బీరువాలో దాచుకున్న రూ.లక్ష నగదుతో పాటు మొత్తం తొమ్మిది వస్తువులు కలిపి 64 గ్రాముల బంగారం అపహరణకు గురైనట్లు నిర్ధారించుకున్నారు. ఈ ఆభరణాల పక్కనే ఆరు సవర్ల బంగారు నెక్లెస్, వెండి వస్తువుల్ని దొంగలు గుర్తించలేదు. ఆమేరకు అద్దంకి పోలీసులకు ఎంఈవో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. బాపట్లకు చెందిన క్లూస్ బృందం సంఘటనా స్థలాన్ని సందర్శించి, వేలిముద్రలు సేకరించింది.



చెల్లాచెదురుగా పడేసిన బంగారు ఆభరణాల సంచులు

మౌలానగర్‌లో మరొకటి..

ఉత్తర అద్దంకి మౌలానగర్‌లో మరో దొంగతనం జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటనపై బాధితురాలు కర్లపూడి సుజాత ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ ఖాదర్‌బాషా తెలిపారు. బాధితురాలు మౌలానగర్‌లో కుట్టుమిషన్ నడుపుకొంటూ జీవిస్తున్నారు. గతనెల 30న ప్రకాశం జిల్లా కురిచేడులోని పుట్టింటికి వెళ్లారు. ఈనెల 3వ తేదీ సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. తలుపు, బీరువా తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. బీరువాలో ఉన్న రూ.20 వేల నగదు, ఎనిమిది గ్రాముల బంగారం, వెండి వస్తువులు, సరకులు అపహరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వీటి విలువ సుమారు రూ.80 వేలుగా నిర్ణయించారు. ఆమేరకు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు దసరా సెలవులు

వేంపల్లె, న్యూస్‌టుడే : రాజీవ్ గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ఆదివారం నుంచి ఈ నెల 13 వరకు దసరా సెలవులు ప్రకటించారు. ఈ మేరకు ఆయా ట్రిపుల్‌ఐటీల్లోని తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు శనివారం స్వగ్రామాలకు బయలుదేరారు. ఈ మేరకు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీకి సంబంధించిన బస్సులతో విద్యార్థులను వేంపల్లెకు తరలించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, రిటైల్ ధర - 145, చికెన్ విత్‌స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 138, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 535 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ. 84/-.